మురుగు..ఆరోగ్యం కనుమరుగు


అనుపాలెం ఊరి మధ్యలో పార్కు వద్ద చెత్త కుప్పలు

- గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్తకుప్పలు
- పారిశుద్ధ్యానికి నీళ్లొదిలేసిన ప్రభుత్వం
- జీతాల్లేక విధుల్లోకి రాని గ్రీన్ అంబాసిడర్లు
- పీహెచ్‌సీకి క్యూకడుతున్న జ్వర బాధితులు


రెడ్డిగూడెంలో బురదమయమైన రహదారి

రాజుపాలెం: ఒక వీధిలోకెళ్తే.. పేరుకుపోయిన చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. మరో వీధిలోకెళ్తే రోడ్డుపై మురుగు పారుతూ దుర్గం వెదజల్లుతుంది. రాత్రయితే..దోమల దాడితో నిద్ర కరవు అవుతోంది. జ్వరాలతో గ్రామస్తులు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. ఇదీ..ప్రస్తుతం పల్లెల ముఖచిత్రం. మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం పడకేసింది. గ్రామాలు మురికి కూపాల్లో మగ్గుతున్నాయి. రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయి ప్రజలు అనారోగ్యపాలవుతున్నారు. చిన్నపాటి వర్షాలకే దిగువ ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. మురుగు నిల్వ ఉండి దోమల ఆవాసంగా మారుతున్నాయి. దీంతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. కొన్ని గ్రామాల్లో నివాసాల మధ్య ఖాళీ ప్రదేశాల్లో పెరిగిన కంప చెట్లు అపరిశుభ్రతకు కేంద్రంగా మారుతున్నాయి. చెత్త సేకరించే గ్రీన్ అంబాసిడర్(పారిశుద్ధ్య కార్మికుల)లకు గౌరవ వేతనాలు చెల్లించకపోవడంతో ఈ దుస్థితి దాపురించింది. కార్మికులు కూడా చేసేది లేక మిన్నకుండి పోతున్నారు. దీంతో వ్యర్థాల కుప్పలు పేరుకుపోతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామాలలో పారిశుద్ధ్యాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవు.

జ్వర బాధితులు పెరిగారు



సీజనల్ వ్యాధులపై ఆరోగ్య సిబ్బంది ఆయా గ్రామాల్లో పర్యటించి, అవగాహన కల్పిస్తున్నారు. ఇంటింటికీ తిరిగి పరిశుభ్రతపై వివరిస్తూ జ్వరం వచ్చిన వారికి వెంటనే రక్త పరీక్షలు చేసి, మాత్రలు పంపిణీ చేస్తున్నాం. రాజుపాలెం పీహెచ్‌సీలో గత మూడు నెలల నుంచి ఓపీలు విపరీతంగా పెరిగాయి. డెంగీ లక్షణాలున్న వారిని వెంటనే గుర్తించి, నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు రిఫర్ చేస్తున్నాం.

– డాక్టర్ కృష్ణకుమార్, వైద్యాధికారి, రాజుపాలెం పీహెచ్‌సీ



కనుల పండువగా తెప్పోత్సవం

నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ మరకతలింగ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో తెప్పోత్సవం ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. నవరాత్రి వేడుకలు ఘనంగా చేశారు. చివరి రోజు ఆదివారం ఆలయ ప్రాంగణంలోని కోనేటిలో తెప్పోత్సవం వేడుక వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు పమిడిమర్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల నడమ పూజాధికాలు శాస్త్రోక్తంగా జరిపించారు. విశేష అలంకరణలో ఉన్న స్వామివార్ల ఉత్సవ మూర్తులు వివిధ రకాల పూలతో అలంకరించిన హంస వాహనంపై కొలువుదీరగా కోనేటిలో ఉత్సవం జరిపించారు. ఈ సందర్భంగా భక్తుల శివ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం స్వామివార్ల దర్శనం చేసుకున్న భక్తులు మొక్కులు చెల్లించారు. సమీప గ్రామాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.


విశేష అలంకరణలో అన్నపూర్ణాదేవి

క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి బంగారు నేత్రాలు

అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అమరేశ్వరాలయంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి బంగారు నేత్రాలను అమరావతికి కోనూరు దేవిప్రసాద్ కుటుంబ సభ్యులు సమర్పించారు. సుమారు 7 గ్రాముల బరువుతో రూ.60 వేల విలువైన రెండు బంగారు నేత్రాలకు సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించి ఈవో వేమూరి గోపినాథ శర్మకి అప్పగించారు. అర్చకులు శంకర మంచి రాజేష్‌శర్మ, రాజశేఖరశర్మ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేకపూజలు చేసి, నేత్రాలను అలంకరించారు. తొలుత దాతలు అమరేశ్వరునికి, బాలచాముండేశ్వరిదేవికి పూజలు నిర్వహించారు

నేడు ప్రజా దర్బార్

పెదకూరపాడు: నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడు ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే భాష్యం సోమవారం ప్రజా దర్బార్ నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారని టీడీపీ మండలాధ్యక్షుడు అతిమల్ల రమేష్ తెలిపారు. పల్లె పండుగలో భాగంగా అంబేడ్కర్ విగ్రహం నుంచి సంగం డెయిరీ పాల కేంద్రం వరకు రూ.50లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బాధితులకు సాయం



పెదకూరపాడు: మండలంలోని 75– త్యాళ్లూరు గ్రామంలో ఇటీవల మరణించిన నరేష్ కుటుంబ సభ్యులను, అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్నా రామదాసు శ్రీనివాసరావుని ఆదివారం పెదకూరపాడు నియోజకవర్గ జనసేన నాయకుడు సుధా సాంబ శివరావు పరామర్శించారు. వారిద్దరికి చెరొకా రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. జనసేన మండల అధ్యక్షుడు మల్లెల వెంకట చలపతి, నాయకులు వీరబ్రహ్మం, సారీలు, గంటా రమేష్, లక్ష్మీకాంత్, వామనపల్లి ఆదినారాయణ, శాకమూరి శ్రీనివాసరావు, బిల్లూరి సురేష్, అమరావతి అధ్యక్షుడు వాకా అఖిల్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమరావతి: మండలంలో 132కేవీ లైన్ సామర్థ్యం పెంచుతున్న కారణంగా సోమవారం మండల పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని విద్యుత్‌శాఖ ఏఈ పి.రవికిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలి పారు. మండలంలోని గ్రామాల్లో ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్


సత్తెనపల్లి: పేకాట స్థావరంపై పట్టణ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. పట్టణంలోని 28వ వార్డ్ పరిధిలో ఉన్న దోభి ఘాట్ వద్ద పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టణ ఎస్‌ఐ పవన్ కుమార్ అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.6,750 నగదు స్వాధీనం చేసుకున్నారు.

రెండు ఆలయాల్లో చోరీలు



ఈపూరు: మండలంలోని ఈపూరు, వనికుంట దేవాలయాల్లో శనివారం రాత్రి చోరీలు జరిగాయి. ఈపూరు బోటిమీద ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ముందు తలుపు తాళాలు పగలగొట్టి లోపలికి వెళ్లిన దొంగలు హుండీని పగలగొట్టి అందులోని నగదును దోచుకున్నారు. అలాగే వనికుంట వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ముందు తలుపులను విరగ్గొట్టి, తాళాలను పగలగొట్టి లోపల ఉన్న హుండీని ధ్వంసం చేసి అందులోని నగదును దోచుకెళ్లారు. రెండు దేవాలయాల్లో దొంగతనాలు ఒకేసారి జరగడంతో దొంగలు ఒక ముఠాగా ఏర్పడి చోరీ చేసినట్లు భావిస్తున్నారు.

యువకుడి అదృశ్యం



మాచర్ల రూరల్: మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన ఉప్పుతోళ్ళ శ్రీనివాసరావు (23) కంభంపాడు గ్రామ కుడికాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. రూరల్ ఎస్‌ఐ కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఉప్పుతోళ్ళ శ్రీనివాసరావు (23) రెండు రోజుల క్రితం కంభంపాడు వద్ద కుడికాలువలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. మృతదేహం కోసం బుగ్గవాగు రిజర్వాయర్‌లో గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ నేటికీ మృతదేహం కనిపించలేదని, ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ ఎం నారాయణ తెలిపారు.

నేటి నుంచి పల్లె పండుగ వారోత్సవాలు

సత్తెనపల్లి: పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం నుంచి 19వ తేదీ వరకు మండలంలోని 25 గ్రామ పంచాయతీలో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బండి శ్రీనివాస రెడ్డి ఆదివారం తెలిపారు. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను ఆయా పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, నోడల్ స్థాయి మండల అధికారులకు జారీచేసినట్లు తెలిపారు. 14న కంటి పూడి, కట్టావారి పాలెం, భీమవరం, 15న గండ్లూరు, ఫణిదం, బట్లూరు, గుజ్జర్లపూడి, 16న దీపాల దిన్నెపాలెం, కట్టమూరు, గోరంట్ల, కొమెరపూడి, లక్కరాజుగార్లపాడు, 17న గుడిపూడి, లక్ష్మీపురం, గర్నెపూడి, 18న ధూళిపాళ్ల, అబ్బూరు, పెదమక్కెన, నంది గామ, 19న కంకణాలపల్లి, భృగుబండ, కందులవారిపాలెం, గోగులపాడు, రెంటపాళ్ల, పాకాలపాడు గ్రామ పంచాయతీలో జరుగుతుందన్నారు. ప్రారంభోత్సవానికి, ముగింపు కార్యక్రమాలకు స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హాజరవుతారన్నారు. ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పంచాయతీ వారోత్సవాలు

అచ్చంపేట: గ్రామాల అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన పల్లెపండుగ–పంచాయతీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఇందులో భాగంగానే మండలంలోని అన్ని గ్రామాలలో గ్రామసభలు నిర్వహించేందుకు మండల స్థాయి అధికారులతో రెండు బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 14న కోనూరు, కస్తల, మాదిపాడు, చల్లగరిగ, 15న ఓర్వకల్లు, కోగంటివారిపాలెం, తాడువాయి, చెరుకుంపాలెం గ్రామాలలో సభలు జరుగుతాయన్నారు. 16న అంబడిపూడి, చిగురుపాడు, గ్రంథశిరి, రుద్రవరం, 17న వేల్పూరు, పుట్లగూడెం, తాళ్లచెరువు, నీలేశ్వరపాలెం, 18న చింతపల్లి, మిట్టపాలెం, కొండూరు, పెదపాలెం గ్రామాల్లో 19న కొత్తపల్లి, అచ్చంపేట, రోకటిగుంటవారిపాలెం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయాల సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొనాలని ఎంపీడీవో కోరారు.

సంక్షోభంలో ఆటో రంగం



సత్తెనపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో ఆటో రంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడిందని సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు గద్దె చలమయ్య అన్నారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన చేయూత ట్రాలీ ఆటో వర్కర్స్ యూనియన్ డివిజన్ కమిటీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశానికి యూనియన్ డివిజన్ అధ్యక్షుడు నాలి రాజేంద్ర అధ్యక్షత వహించారు. చలమయ్య మాట్లాడుతూ ఆటో కార్మికులు తమ సమస్యలను ఐక్యంగా ఉండి పోరాడి పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.హరి పోతురాజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల పరంగా ఇబ్బందులను చర్చించేందుకు ఈ నెల 19, 20 తేదీల్లో నంద్యాలలో రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులకు సభ్యులంతా హాజరుకావాలని కోరారు. యూనియన్ డివిజన్ కార్యదర్శి ఏ వెంకట్, కొత్తపల్లి చిన్న మల్లయ్య, నాగేశ్వరరావు, జి.ఇమ్మానియేలు, ఘంటా సాంబ శివరావు, టి.వెంకట్రావు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

పెదకూరపాడు: దళితులను దూషించి, దాడి చేసి గాయపరిచిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, దళిత యువకులపై పెట్టిన తప్పుడు కేసులను రద్దు చేయాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కూరపాటి కృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని లగడపాడు గ్రామంలో వినాయక చవితి నిమజ్జన కార్యక్రమంలో అగ్రకులాల వారు దళితులను రెచ్చగొట్టి దాడి చేసిన వారిని వదిలేసి, వారిపైనే అక్రమ కేసులు పెట్టడాన్ని నిరసించారు.

బాధితుడిపైనే కేసు నమోదు


చికిత్స పొందుతున్న జవ్వాది నాగరాజు

సత్తెనపల్లి: అధికార పార్టీ నాయకుల సూచనల మేరకు సత్తెనపల్లి రూరల్ పోలీసులు ఏకపక్షంగా కేసులు నమోదు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెంటపాళ్ళ గ్రామానికి చెందిన జవ్వాది నాగరాజు, జవ్వాది వీర కుమారి భార్యభర్తలు. గింజి గంగాధర్ రావు, గింజి శ్రీలక్ష్మి, గింజి కొండలు, గింజి గోపీ రెండు రోజుల క్రితం ఘర్షణ పడ్డారు. గింజి గంగాధరరావు వైపు అధికార పార్టీ నేతలు కొమ్ము కాసి పోలీసులకు ఫోన్‌లు చేయడంతో వారి కేసు నమోదు చేసి, డొక్కలో వెన్నుపూసకు గాయాలై వైద్యశాలలో చికిత్స పొందుతున్న జవ్వాది నాగరాజు కేసు మాత్రం నమోదు చేయలేదు. దాడి చేసిన వారే ముందుగా వచ్చి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే బాధితుడిపై కేసు నమోదు చేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బైక్ చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

ముప్పాళ్ళ: బైక్ చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసి, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వి.సోమేశ్వరరావు ఆదివారం తెలిపారు. చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన టి.పిచ్చయ్య ఈ నెల 11న ఉదయం తన ద్విచక్ర వాహనాన్ని రహదారి పక్కన పార్క్ చేసి ఉండగా కొద్ది సేపటికి కనిపించకుండా పోయింది. ఈ మేరకు పిచ్చయ్య ముప్పాళ్ల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు రాజుపాలెం మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన తమ్మిశెట్టి గోపీగా గుర్తించారు. ఈ నెల 13న నిందితుడిని అరెస్ట్ చేసి, దొంగిలించిన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. గోపీని సత్తెనపల్లి కోర్టుకు హాజరు పరచినట్లు ఎస్సై తెలిపారు.

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి


సమావేశంలో మాట్లాడుతున్న గార్లపాటిదాసు

క్రోసూరు: అత్తాకోడళ్లపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గార్లపాటి దాసు ఆదివారం విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాల సెంటర్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కర్ణాటకలోని బళ్లారికి చెందిన నలుగురు శ్రీ సత్య సాయి జిల్లా చిలమత్తూరు మండలం నల్లబొమ్మని పల్లిలో పేపర్ మిల్లులో కూలీ పనులు చేసుకుని జీవిస్తున్నారన్నారు. శనివారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనాలపై వచ్చిన ఐదుగురు తండ్రి కొడుకులను కత్తులతో బెదిరించి కట్టేసి అత్తాకోడళ్లపై అత్యాచారం చేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక హోం మంత్రి అనిత ఆడవారిపై అఘాయిత్యం చేస్తే..నిందితులకు అదే ఆఖరి రోజు అని అన్నారని గుర్తుచేశారు. కానీ రాష్ట్రంలో ప్రతిరోజు ఏదో ఒక చోట బాలిక, మహిళపై అత్యాచారం, హత్య జరుగుతూనే ఉన్నాయన్నారు. చివరికి ఒక పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తల్లికే రక్షణ లేకుండా పోయిందన్నారు. మండలి అధ్యక్షుడు చిలక భాస్కరరావు. నియోజకవర్గం కన్వీనర్ కంచర్ల అచ్యుతరావు, కన్వీనర్ మందడపు నాగయ్య పాల్గొన్నారు.

ఆచరణలో కనిపించని ఉచిత ఇసుక

- పనులు లేక అప్పుల పాలవుతున్న భవన నిర్మాణ రంగ కార్మికులు
- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రవిబాబు


సీపీఎం నేత సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రవిబాబు, నాయకులు

సత్తెనపల్లి: జిల్లాలో వ్యవసాయ కార్మికులకు పనులు లేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని, ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గంజిమాల రవిబాబు డిమాండ్ చేశారు. పట్టణంలోని రంగా కాలనీలో 2వ వార్డు శాఖ మహా సభలో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. పార్టీ నేత యనగందల సాయిబాబు అధ్యక్షత వహించారు. రవిబాబు మాట్లాడుతూ ఇసుక లేక, భవన నిర్మాణాలు జరగక, కార్మికులు పనులు లేక, అడ్డాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం ఉచిత ఇసుక ప్రకటించడమే.. తప్ప ఆచరణలో జరగడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇసుక సరఫరాను సరళతరం చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్మికులకు పనులు దొరకని ప్రస్తుత పరిస్థితుల్లో నిత్యావసర వస్తువుల ధరలు అధికంగా పెరగడంతో అప్పులు పాలవ్వాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. రేషన్ షాపుల ద్వారా బియ్యంతో పాటు కందిపప్పు,పంచదార కూడా సరఫరా చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఆచరణలో కందిపప్పు అందరికీ అందలేదన్నారు. ఈ మహాసభలో శాఖ కార్యదర్శి దార్ల నిర్మల గత మూడు సంవత్సరాల కార్యకలాపాల కార్యదర్శి నివేదికను మహాసభలో ప్రవేశపెట్టారు. శాఖ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం నూతన కార్యదర్శిగా పరుచూరి కాశీని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. సీపీఎం పట్టణ నాయకులు జడ రాజకుమార్ పరిశీలకులుగా పాల్గొన్నారు. ఇటీవల మరణించిన సీపీఎం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాఖ సభ్యులు పర్చూరు సముద్రాలు, వంకాయ పార్టీ పద్మ పాల్గొన్నారు.


శ్రీరాజరాజేశ్వరిదేవిగా వాసవీ మాత


సత్తెనపల్లి: త్రిశక్తిదుర్గాపీఠంలో శ్రీరాజరాజేశ్వరిదేవి


సత్తెనపల్లి: వెంకటపతి కాలనీలో శ్రీరాజరాజేశ్వరిదేవి


సత్తెనపల్లి: మేదర సంఘ రామాలయంలో రాజరాజేశ్వరిదేవి


సత్తెనపల్లి: పెదమక్కెనలో శ్రీరాజరాజేశ్వరిదేవి

అంబరాన్నంటిన దసరా సంబరాలు


అమరావతి: బాలా త్రిపుర సుందరీ దేవి మహిళా మండలి ఆధ్వర్యంలో బతుకమ్మ పూజలు


అమరావతి: పెద్దింటమ్మతల్లి ఉత్సవ విగ్రహం ఊరేగింపు


క్రోసూరు వాసవీ మాత అలంకరణ బంగారు చైను రూ.1.25 లక్షలకు కైవసం చేసుకున్న భక్తుడు కూరపాటి ప్రసాద్


అచ్చంపేటలో మహిషాసురమర్దినిగా కన్యకాపరమేశ్వరి


లంకెలకూరపాడులో శ్రీరాజరాజేశ్వరి అలంకరణ


క్రోసూరు: రాజరాజేశ్వరీ దేవిగా క్రోసూరు వాసవీ మాత


సీతారామస్వామిదేవాలయంలో విజయలక్ష్మిగా అమ్మవారు


- భక్తులతో కిటకిటాడిన ఆలయాలు
- సందడిగా మారిన గ్రామోత్సవాలు
- రాజరాజేశ్వరీదేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవార్లు

సత్తెనపల్లి: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని(దసరా) సంబరాలు అంబరాన్ని అంటాయి. సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లోని ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులు సంప్రదాయ పద్ధతుల్లో పూజలు నిర్వహించి, పెద్ద ఎత్తున మొక్కులు చెల్లించుకున్నారు. శరన్నవరాత్రి మహోత్సవాలు శనివారం దసరాతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా వివిధ అమ్మవార్ల ఆలయాల్లో అమ్మవారిని శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా అలంకరించి పూజలు చేశారు.


సత్తెనపల్లి: నందిగామ చౌత్రా సెంటర్‌లో బతుకమ్మ నిమజ్జన ప్రదర్శన


పెదకూరపాడు: 75 త్యాళ్లూరులో దుర్గాదేవిగా అమ్మవారు

శ్రీవారికి ప్రత్యేక పూజలు


మోహిని అలంకారంలో శ్రీవారు


వడ్డవల్లిలో ప్రత్యేక అలంకరణలో..

సత్తెనపల్లి: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న వేంకటేశ్వర స్వామి దేవాలయం, వడ్డవల్లి శ్రీ రామాలయం ,వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారు మోహిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యల హాజరై స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

లాటరీ సమయానికి హాజరు కావాలి

క్రోసూరు: మద్యం షాపుల లాటరీ సోమవారం నరసరావుపేట టౌన్ హాలు ప్రకాశ్‌నగర్‌లో జరుగుతుందని, దరఖాస్తుదారులు ఉదయం 7 గంటలకు కల్లా హాజరు కావాలని క్రోసూరు ఎక్సైజ్ సీఐ టి.తులసి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్కిల్ పరిధిలోని మొత్తం 10 షాపులకు 329 దరఖాస్తులు వచ్చినట్లు ఆమె తెలిపారు.